జీరో అవర్‌లో సమస్యలపై ఏకరువు

- కౌశిక్‌రెడ్డి మైక్ కట్ చేసిన స్పీకర్.. పాడి వ్యాఖ్యలను తొలగించాలన్న నాగరాజు
- మాజీ ఎమ్మెల్యేలు రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, కొండా లక్ష్మారెడ్డికి సభ సంతాపం
- సంతాప తీర్మానం తర్వాత ఇంటికి వెళ్లిపోయిన మాజీ సిఎం
- కెసిఆర్‌ను పలకరించిన సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తొలిరోజు ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాల్లో జీరో అవర్ గంటా 40 నిమిషాలకు పైగా నడిచింది. అందులో అధికార ప్రతిపక్ష పార్టీ అనే తేడా లేకుండా సభ్యులు తమ నియోజకవర్గాల్లోని సమస్యలను ఏకరువు పెట్టారు. వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు. సభలోని ఎక్కువ మంది సభ్యులు తమ నియోజకవర్గాల్లోని ఆస్పత్రుల విస్తరణ, మౌలిక వసతుల కల్పన, సాగునీటి రంగ పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి, ఆమ్లేట్ గ్రామంలో రేషన్‌షాపుల సబ్ సెంటర్ల ఏర్పాటు వంటి అంశాలను ప్రస్తావించారు. జీరో అవర్‌లో మొత్తం కాకుండా 39 మంది సభ్యులు మాట్లాడారు. అందులో బిఆర్ఎస్ నుంచి 12, కాంగ్రెస్ నుంచి 20, బిజెపి నుంచి ముగ్గురు, ఎంఐఎం నుంచి ముగ్గురు, సిపిఐ నుంచి ఒకరు మాట్లాడారు. సభలో వారు లేవనెత్తిన సమస్యలను నోట్ చేసుకున్నామంటూ మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు సమాధానాలిచ్చారు.

పారిశుధ్య, విద్యుత్తు, రోడ్ల సమస్యలపై జిహెచ్ఎంసి పరిధిలోని ఎమ్మెల్యేల ప్రస్తావన

ఎంఐఎం సభ్యులు బలాల, మాజిద్ హుస్సేన్, జాఫర్ హుస్సేన్ మాట్లాడుతూ..జిహెచ్ఎంసిలో ముఖ్యంగా పాతబస్తీలో పారిశుధ్యం పడకేసిందని ఎత్తిచూపారు. ఓవర్ గార్డెన్ నుంచి వారానికోసారి చెత్తను తీసుకున్నారని, దీంతో అక్కడ దుర్వాసనతో ప్రజలు వ్యాధుల ప్రబలుతున్నాయని వాపోయారు. వీధి లైట్లను వేయించాలని కోరారు. ఓవర్సీస్ స్కాలర్ షిప్పులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. చిన్నపిల్లలకు వైద్యం విషయంలో దేశంలోనే ప్రసిద్ధి పొందిన నీలోఫర్ ఆస్పత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, డాక్టర్ల సంఖ్యను పెంచాలని మాజిద్ హుస్సేన్ విన్నవించారు. నాంపల్లి నియోజకవర్గంలో ఒకేషనల్ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. మూసీనదిపై మలక్‌పేట్-అంబర్‌పేట మధ్య ఉన్న మూసారాంబాగ్ బ్రిడ్జి పనులు ప్రారంభమై మూడేండ్లు అవుతున్నదని, దాన్ని త్వరగా పూర్తిచేయాలని బిఆర్ఎస్ సభ్యులు కాలేరు వెంకటేశ్ కోరారు. ఆ బ్రిడ్జి పనుల్లో ఆలస్యం వల్ల ఆ రూట్‌లో ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. కాంగ్రెస్ సభ్యులు నవీన్‌యాదవ్ మాట్లాడుతూ..వర్షాకాలంలో కృష్ణానగర్ ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని ఆ సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. హైటెన్షన్ వైర్ల సమస్యను పరిష్కరించేందుకు భూగర్భ కేబుల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. అక్బరుద్దీన్ ఒవైసీ, సబిత ఇంద్రారెడ్డి మాట్లాడుతూ..తమ నియోజకవర్గాల్లోని డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని విన్నవించారు.



అసెంబ్లీలో మాజీ ముఖ్య మంత్రి కెసిఆర్‌ను పలకరిస్తున్న మాజీ సిఎం మంత్రి రేవంత్ రెడ్డి

మరోసారి కౌశిక్‌రెడ్డి మైక్ కట్‌చేసిన స్పీకర్

బిఆర్ఎస్ సభ్యులు పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ..తన నియోజకవర్గంలోని కల్వల ప్రాజెక్టును పూర్తిచేస్తే ఆరేడు వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చునని, దాన్ని త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. మేడిగడ్డను బాంబు పెట్టి పేల్చినట్లుగానే మంత్రి కొడుకుకు చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ తన నియోజకవర్గంలోని తనుగుల చెక్‌డ్యామ్‌ను బాంబు పెట్టి పేల్చిందని ఆరోపించారు. దీంతో సభలో ఉద్రిక్తత నెలకొంది. ఈడ కూర్చొని మాట్లాడటం గాదు తన నియోజకవర్గానికి వచ్చి చూడాలంటూ కాంగ్రెస్ సభ్యులకు సవాల్ విసిరారు. ఇంతలోనే కౌశిక్‌రెడ్డి మైక్‌ను స్పీకర్ కట్ చేశారు. కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలను తొలగించాలని కాంగ్రెస్ సభ్యులు పట్టుబట్టారు.

నా నియోజకవర్గంలోనూ కోతుల సమస్య : స్పీకర్ ప్రసాద్‌కుమార్

కాంగ్రెస్ సభ్యులు రాంచందర్‌నాయక్ మాట్లాడుతూ..తన నియోజకవర్గంలోని ఆమ్లేట్ గ్రామంలో రేషన్ షాపులకు సంబంధించిన సబ్ సెంటర్లను పెట్టి ప్రజల ఇబ్బందులను తొలగించాలని కోరారు. రేషన్ తెచ్చుకోవడానికి కొన్ని కిలోమీటర్ల దూరం నడవాల్సి వస్తున్నదని ఎత్తిచూపారు. తన నియోజకవర్గంలో కోతుల సమస్య తీవ్రంగా ఉందని, రైతుల పంటలను ఆగం చేస్తున్నాయని సభలో ఏకరువు పెట్టారు. ఇంతలోనే స్పీకర్ ప్రసాద్‌కుమార్ జోక్యం చేసుకుంటూ...నా నియోజకవర్గంలోనూ కోతుల సమస్య తీవ్రంగా ఉందనీ, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దీన్ని పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు.

హరీశ్‌రావు వర్సెస్ మంత్రి శ్రీధర్‌బాబు

జీరో అవర్ అరణ్యరోదనగా మారిందనీ, మంత్రులు నోట్ చేసుకుంటున్నామని చెబుతున్నారుగానీ సమాధానాలు పంపడం లేదనీ, సమస్యలు పరిష్కరించడం లేదని బిఆర్ఎస్ సభ్యులు టి.హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వానికి రథచక్రాలుగా ఉండే ఉద్యోగులు తీవ్ర మనోవేదనలో ఉన్నారని, వారి ఆరు డిఏలు పెండింగ్‌లో పెట్టడం దుర్మార్గమని అన్నారు. పిఆర్‌సి రెండేండ్లుగా పెండింగ్‌లో ఉందని ప్రస్తావించారు. తమ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఇహెచ్ఎస్ జిఒను అమలు చేయడం లేదని విమర్శించారు. పిఎఫ్, రిటైర్డ్ బెనిఫిట్స్ అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సిపిఎస్‌ను ఓపిఎస్‌గా మారుస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. పోలీసులకు సరెండర్ లీవ్‌లు ఎందుకు పెండింగ్‌లో పెట్టున్నారని అడిగారు. పోలీసులకు ఆరోగ్యభద్రత స్కీమ్‌ను లక్ష రూపాయలకు కుదించడం దారుణమన్నారు. దీనికి మంత్రి శ్రీధర్‌బాబు సమాధానమిస్తూ..ఉద్యోగుల సమస్యల పట్ల హరీశ్‌రావు మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందని విమర్శించారు. 20వ తేదీ వరకు కూడా జీతాలు చెల్లించనివారు ఇప్పుడు ఉద్యోగుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. జిపిఎఫ్, రిటైర్డ్ బెనిఫిట్స్ అందించేందుకు తమ ప్రభుత్వం వ్యవస్థను ఏర్పాటు చేసుకుని ముందుకెళ్తుందని చెప్పారు.

సింగరేణి పరిరక్షణ కోసం ఆ ప్రాంత ఎమ్మెల్యేలతో సమావేశం పెట్టండి : కూనంనేని

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలతో మైనింగ్ రంగం ప్రయివేటు పరం అవుతుందని, అందులో భాగంగా సింగరేణి కూడా ప్రయివేటీకరణ అయిపోయే ప్రమాదం ఉందని సిపిఐ పక్షనేత కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. సింగరేణి పరిరక్షణ కోసం దాని పరిధిలోని ఎమ్మెల్యేలతో సీఎం ప్రత్యేక సమావేశం నిర్వహించాలని కోరారు. తీవ్ర అసంతృప్తిలో ఉన్న సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని విన్నవించారు. డిపెండెంట్ ఎంప్లాయ్ వ్యవస్థ సరిగా అమలు కావడం లేదన్నారు. కారుణ్య నియామకాల వయస్సు 40 ఏండ్లకు పెంచాలనీ, మెడికల్ బోర్డు సమావేశాలు మొక్కుబడిగా జరుగుతున్నాయని విమర్శించారు. కేంద్రం నిర్ణయాల వల్ల సింగరేణి బ్లాకులు ప్రయివేటు సంస్థల చేతుల్లోకి వెళ్తున్నాయనీ, కనీసం బొగ్గు వెలికి తీసే పనినైనా సింగరేణికి అప్పగించాలని సూచించారు. కోలిండియా తరహాలో సింగరేణిలోనూ ట్యాక్స్ రిటర్న్ చేయాలని కోరారు. సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని తగ్గించాలని విన్నవించారు.

మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి సభ సంతాపం

తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డి మృతికి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. వారి మృతికి సంతాపం ప్రకటించారు. ఇరువురి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంత్రిగా, ఎమ్మెల్యేగా దామోదర్‌రెడ్డి అందించిన సేవలను వివరించారు. ఎన్ఎస్ఎస్ స్థాపించి, రాజకీయ రంగంలో రాణించిన లక్ష్మారెడ్డి సేవలను స్మరించుకున్నారు. అనంతరం సభ రెండు నిమిషాల పాటు మౌనం పాటించి సంతాపం తెలిపింది.

కెసిఆర్ గారు..బాగున్నారా...

బయటేమో కృష్ణా, గోదావరి జలాలపై సిఎం, మాజీ సిఎం మధ్య మాటల యుద్ధం నడుస్తున్న సమయాన.. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య నీటి యుద్ధమే జరుగుతున్న వేళ.. చాలా కాలం తర్వాత కెసిఆర్ సభకొచ్చిన వేళ.. అసెంబ్లీ హాట్‌హాట్‌గా సాగుతుందని అందరూ అనుకున్నారు. కానీ, తొలి రోజు అదేం జరగలేదు. ప్రతిపక్ష నేత కే.చంద్రశేఖర్‌రావు తమ పార్టీ సభ్యులతో సభాసమయానికి కొంతముందే వచ్చి కూర్చున్నారు. కరెక్టుగా 10:31 నిమిషాలకు సిఎం రేవంత్‌రెడ్డి సభలో అడుగుపెట్టారు. స్వయంగా కేసీఆర్ వద్దకెళ్లి చేతులు జోడించి నమస్కరించారు. బాగున్నారా అంటూ పలుకరించారు. అంతా బాగే అన్నట్టు కెసిఆర్ సైగ చేశారు. ఇద్దరూ షేక్‌హ్యాండ్ ఇచ్చుకున్నారు. వెంటనే సిఎం వెళ్లి తన సీటులో ఆసీనులయ్యారు. ఆ తర్వాత విప్ ఆది శ్రీనివాస్, మంత్రులు శ్రీధర్‌బాబు, వాకిటి శ్రీహరి, కోమటిరెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు కూడా కెసిఆర్ దగ్గరకెళ్లి నమస్కరించి వచ్చారు. జూబ్లీహిల్స్ నుంచి గెలుపొందిన కాంగ్రెస్ సభ్యులు నవీన్‌యాదవ్ మర్యాదపూర్వకంగా వెళ్లి కెసిఆర్‌ను కలిశారు.. జాతీయ గీతం ఆలాపన అయిపోగానే స్పీకర్ సంతాపతీర్మానాన్ని ప్రవేశపెట్టే సమయంలో సభ నుంచి కెసిఆర్ బయటకు వెళ్లిపోయారు. సంతాప తీర్మానం అయిపోగానే సిఎం రేవంత్‌రెడ్డి కూడా బయటకు వెళ్లిపోయారు. తొలి రోజు నుంచే హాట్‌హాట్‌గా సభ జరుగుతుందనే చర్చ నేపథ్యంలో సభలో ఒకరినొకరు పలుకరించుకోవడం మంచి పరిణామమే. అయితే, సభలో పట్టుమని పది నిమిషాలు కూడా ఇద్దరూ కూర్చోకపోవడం బాధాకరం. రెండో తేదీ నుంచి ఏడో తేదీ వరకు జరిగే సభలో అధికార, ప్రతిపక్ష ఎంత వరకు హుందాగా నడుచుకుంటారు? చిత్తశుద్ధితో ప్రజా సమస్య పరిష్కారానికి ఎంత మేర చర్చిస్తారో? కృషిచేస్తారో? లేదంటే ఎప్పటిగానే మాటల దండకంతో ఒకరిపై మరొకరు నోరు పారేసుకుంటారా? అనేది మునుముందు చూడాల్సిందే.

మున్సిపల్ ఓటర్ల జాబితా తయారీకి షెడ్యూల్

- సర్క్యులర్ జారీ చేసిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ఆరు మున్సిపల్ కార్పొరేషన్లు, 117 మున్సిపాల్టీలకు సంబంధించి అన్ని వార్డుల్లో పోలింగ్ స్టేషన్ వారీగా ఓటర్ల జాబితా తయారీ, ప్రచురణకు సంబంధించిన షెడ్యూల్‌ను తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఈ మేరకు సోమవారం కమిషనర్ రాణి కుముదిని సర్క్యులర్ జారీ చేశారు. ఈ నెల 30న పోలింగ్ స్టేషన్ల వారీగా డేటాను తిరిగి అమర్చాలనీ, 31న వార్డుల వారీగా పోలింగ్ స్టేషన్ల సమాచారం పునర్వ్యవస్థీకరించడం, అదే రోజు పోలింగ్ స్టేషన్ల వారీగా ఓటర్ల రోల్స్‌లో డేటాను చేర్చాలని పేర్కొంది. జనవరి ఒకటిన పేర్లు, చిరునామాలపై అభ్యంతరాలను స్వీకరిస్తారు. అనంతరం నోటీసు బోర్డులపై పోలింగ్ స్టేషన్ వారీగా డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. ఐదున యుఎల్‌బి స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో మున్సిపాల్టీ, కార్పొరేషన్ కమిషనర్ల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నారు. ఆరున జిల్లా స్థాయిలో ఎన్నికల అధికారుల సమీక్ష జరుగుతుంది. అనంతరం జనవరి పదిన ఓటర్ల తుది జాబితాను ప్రచురిస్తారు.

ఫండింగ్ నివేదికలు సమర్పించండి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలోని అన్ని రిజిస్టర్డ్ అన్‌రికగ్నైజ్డ్ రాజకీయ పార్టీలు తమ విరాళాలు, ఎన్నికల ఖర్చు వివరాలను గడువులోపల సమర్పించాలని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సి సుదర్శన్ రెడ్డి సోమవారం ఆదేశాలు జారీ చేశారు. గడువు పూర్తయ్యాక అందే వివరాలను పరిగణంలోకి తీసుకోమని స్పష్టం చేశారు. ప్రతినిధుల చట్టం 1951లోని సెక్షన్లు 29 బి, 29 సి ప్రకారం విరాళాల నివేదికలు, ఆడిటెడ్ వార్షిక ఖాతాలు, పూర్తి ఎన్నికల ఖర్చుల ప్రకటనలను పార్టీలు సిఇఒ కార్యాలయానికి సమర్పించాలని సూచించారు.

వీధి కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. తాజాగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సూరారం ప్రాంతంలో బాలుడిని వీధి కుక్క కరిచింది. వివరాల్లోకెళ్తే.. సూరారం ప్రాంతంలో ఐదేండ్ల బాలుడు ఇంటి ముందు ఆడుకుంటుండగా అకస్మాత్తుగా వీధి కుక్కల గుంపు దాడి చేసింది. బాలుడిని కింద పడేసి విచక్షణారహితంగా కరిచాయి. బాలుడు కేకలు విని కుటుంబీకులు బయటకు వచ్చి కుక్కలను తరిమేశారు. తీవ్రంగా గాయపడిన బాలుడిని తల్లిదండ్రులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. కుక్కల దాడి దృశ్యాలన్నీ సీసీ కెమెరాలో రికార్డయ్యాయి.

క్రైస్తవులకు కమ్యూనిటీ హాల్‌ను కేటాయించాలి

- ఎంసిపిడబ్ల్యుఎ

హైదరాబాద్ బ్యూరో : క్రైస్తవుల కోసం కమ్యూనిటీ హాల్‌తో పాటు స్మశానవాటిక కోసం స్థలం కేటాయించాలని మలక్‌పేట్ నియోజకవర్గ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఎంసిపిడబ్ల్యుఎ) కోరింది. ఈ మేరకు సోమవారం అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎర్రోళ్ల మాణిక్యం అబ్రహం నేతృత్వంలో నాయకులు బి శ్రీధర్ రాజు, టి నవీన్, కె సుదర్శన్ తదితరులు రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. మంత్రిని నాయకులు సన్మానించారు. అనంతరం అజహరుద్దీన్ కేక్ కట్ చేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు.

త్రిపురనేని రామ స్వామి మానవత హేతువాద సాహిత్య ప్రచారకుడు

ప్రజాశక్తి - కల్చరల్

త్రిపురనేని రామస్వామి తన సాహిత్యం ద్వారా మానవతా విలువలు హేతు వాద దృక్పథం ప్రచారం చేశారని హై కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ పాటిబండ సత్యనారాయణ ప్రసాద్ అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని గుండవరపు హనుమంత రావు కళా వేదికపై గాన సభ నిర్వాహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా త్రిపురనేని రామ స్వామి యాదిలో పేరిట సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ సత్యనారాయణ ప్రసాద్ మాట్లాడుతూ సంఘ సంస్కరణ ఉద్యమకారుడు రామ స్వామి అన్నారు. తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శంకరం మాట్లాడుతూ రామ స్వామి రచించిన సూత పురాణం. అంధ విశ్వాసాలు ఆచారాలపై తిరుగుబాటు చేసిందని చెప్పారు. రామ స్వామి స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్నారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై గాన సభ పాలక మండలి సంయుక్త కార్యదర్శి చక్రపాణి గాయని రుక్మిణిపాల్గొన్నారు.

విద్యా రంగానికి పది శాతం బడ్జెట్ కేటాయించాలి

- యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్ల వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి 10 శాతం నిధులు కేటాయించాలని అన్ని యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్లు కోరారు. సోమవారం హైదరాబాద్‌లో ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో వైస్ ఛాన్సలర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మంజూరైన పోస్టులను భర్తీ చేసేందుకు అనుమతి, నియామక ప్రక్రియపై స్పష్టత, రోస్టర్ పాయింట్ల ఖరారు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, యుజీ, పీజీ, క్రెడిట్ ఫ్రేమ్ వర్క్, అడ్మిషన్ల కోసం కామన్ కరిక్యులమ్ కమిటీ ఏర్పాటు తదితర అంశాలను ప్రస్తావించారు. వైస్ ఛాన్సలర్లు చేసిన వినతులను ప్రభుత్వంతో పాటు సంబంధిత యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లనున్నట్టు తెలంగాణ ఉన్నత విద్యా మండలి హామీనిచ్చింది. అంతకుముందు సమావేశాన్ని ఉద్దేశిస్తూ ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొఫెసర్ డాక్టర్ వి బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ యువత ఎక్కువగా ఉండి, శరవేగంగా సాంకేతిక ప్రగతి సాధిస్తూ, ఆవిష్కరణలు, ఆర్థిక అభివృద్ధిలో భారతదేశం ప్రపంచ లీడర్‌గా ఎదిగే బలాలు కలిగి ఉందని గుర్తుచేశారు. ఈ సమావేశంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్లు ఇ పురుషోత్తం, ప్రొఫెసర్ ఎస్కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, వివిధ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు పాల్గొన్నారు.

టీజీ సెట్స్ -2026కు కన్వీనర్లు

టిజి సెట్స్ -2026కు తెలంగాణ ఉన్నత విద్యామండలి వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లను కన్వీనర్లుగా నియమించింది. ఈ మేరకు మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టీజీఎప్ సెట్‌కు ప్రొఫెసర్‌కు కె.విజయ కుమార్ రెడ్డి (జెఎన్‌టియుహెచ్), టిజి ఎడ్‌సెట్‌కు బి.వెంకట్రామ్ రెడ్డి (కెయు) ఐసెట్‌కు అలువుల రవి (మహాత్మాగాంధీ యూనివర్సిటీ), ఈసెట్‌కు పి.చంద్రశేఖర్ (ఒయు), లాసెట్, పిజిఎల్‌సెట్‌కు బి విజయలక్ష్మి (ఒయు), పిజిఇసెట్ కె వెంకటేశ్వర రావు (జెఎన్‌టియుహెచ్), పిఇసెట్‌కు రాజేశ్ కుమార్ (శాతావాహన యూనివర్సిటీ) నియమితులయ్యారు.

పుస్తకాలు భావ స్వేచ్ఛకు సాధనాలు

- జస్టిస్ సుదర్శన్ రెడ్డి

ప్రజాశక్తి -కల్చరల్

భిన్న భావాలు ఆలోచనలు పుస్తక రూపంలో వెలువరించడం భావ స్వేచ్ఛకు సాధనాలని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి అన్నారు. పుస్తక ప్రదర్శనలో వైరుధ్య ఆలోచనల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని వారి వారి ఆసక్తిని బట్టి కొనుగోలు చేసుకోవచ్చు. ఇదే రాజ్యాంగం ఇచ్చిన భావ ప్రకటన స్వేచ్ఛ అని ఆయన పేర్కొన్నారు. ఎన్‌టిఆర్ స్టేడియంలో జరుగుతున్నట్లు హైదరాబాద్ బుక్ ఫెయిర్ ముగింపు వేడుకలలో జస్టిస్ సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పుస్తక ప్రదర్శన పెద్ద సంఖ్యలో పుస్తక ప్రియులు వీక్షించటం శుభ పరిణామం అన్నారు. సామాజిక మధ్యమం సినిమాలు టివి చానల్స్ ఇన్ని ఉన్నా యువత ఎక్కువ సంఖ్యలో పది రోజుల పుస్తక ప్రదర్శనకు రావడం సమాజంలో వస్తున్న మార్పుకి సంకేతం అని అభిప్రాయం వ్యక్తం చేశారు బుక్ ఫెయిర్ సొసైటీ సభ్యులకి సూచన చేస్తూ భారత రాజ్యాంగం తెలుగు భాషలో అనువాదం చిన్న పుస్తకంగా ముద్రించి తక్కువ ధరకు రాబోయే పుస్తక ప్రదర్శనలో అందుబాటులోకి తీసుకు రావాలని, సొసైటీ సభ్యులలో మహిళ సభ్యులు సంఖ్య పెంచాలని చెప్పారు. పుస్తక ప్రదర్శనలో శాంతి భద్రతల సమస్య లేకుండా ప్రశాంతంగా జరిగినందుకు సొసైటీకి అభినందన తెలిపారు. ఓపెన్ యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య ఘంట చక్రపాణి మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలు ప్రచురించిన గ్రంథాలను అందుబాటులో ఉంచాలన్నారు. పుస్తక ప్రదర్శన కనీసం రెండు వారాలు ఉండాలి అని సూచించారు. పుస్తక ప్రదర్శనలో ఉంచిన పుస్తకాల పై కూడా రచయితలతో చర్చ జరపాలని కోరారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పుస్తక పఠనంలో అమెరికా ప్రపంచంలో తొలి స్థానంలో, భారత్ రెండవ, బ్రిటన్ మూడవ స్థానంలో ఉన్నాయని చెప్పారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ కి 15 లక్షల మంది వీక్షకులు రావటం విశేషమ న్నారు. ప్రముఖ జర్నలిస్టు రామచంద్ర మూర్తి మాట్లాడుతూ చర్చా వేదిక పైకి జాతీయ స్థాయిలో భిన్న భావాలు కల ప్రఖ్యాత విద్యావేత్తలు, ఆలోచన పరులు, జర్నలిస్టులను ఆహ్వానించాలని చెప్పారు. ప్రొఫెసర్ కోదండ రామ్ ప్రొఫెసర్ రమా మెల్కోటే తదితరులు పాల్గొనగా సొసైటీ అధ్యక్షుడు యాకుబ్ అధ్యక్షత వహించగా కార్యదర్శి వాసు నివేదిక నివేదిక సమర్పించారు.

తెలంగాణలో దేవులపల్లి రామానుజరావు స్థానంపై పిహెచ్‌డి

- నాయకోటి సుజాతకు డాక్టరేట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ యూనివర్సిటీలో తెలుగు అధ్యయన శాఖలో నాయకోటి సుజాతకు పిహెచ్‌డి పట్టా ప్రదానం చేశారు. ఆ చార్య కె. లావణ్య పర్యవేక్షణలో పరిశోధక విద్యార్థి నాయకోటి సుజాత తెలంగాణలో దేవులపల్లి రామానుజారావు స్థానం అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని తెలంగాణ విశ్వవిద్యాలయానికి సమర్పించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడారు. డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కాకతీయుల గడ్డపై పుట్టి.. కలాన్ని చేతబట్టి.. కాలంతో పాటు పరుగులు పెట్టి.. తెలంగాణ చైతన్యాన్ని కలవరించిన నిత్య కృషీవలుడు అన్నారు. డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కవిగా, వక్తగా, విద్యావేత్తగా, పత్రికా రచయితగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా వెలుగొందిన ధీశాలి అన్నారు. తెలుగు భాషాభివృద్ధి కోసం హైదరాబాద్ బొగ్గుల కుంటలో తెలంగాణ సారస్వత పరిషత్తును ఏర్పాటు చేసి జీవితాన్ని అంకితం చేసిన ధన్యజీవి అన్నారు. పత్రికా ముఖంగా ప్రజానీకానికి, సాహితీ సంస్థల ద్వారా అక్షర లోకానికి దన్నుగా నిలిచిన పుణ్యజీవి డాక్టర్ దేవులపల్లి రామానుజ రావని కొనియాడారు. తెలుగు భాషాభివృద్ధి కోసం దేవులపల్లి రామానుజ రావు పాటుపడిన విషయాన్ని సిద్ధాంత గ్రంథంలో పేర్కొన్నారు.

మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రిపేరై రావాలి

- జనవరి ఒకటిన పిపిటికి ఎవ్వరికీ మినహాయింపు లేదు
- మంత్రులకు సిఎం రేవంత్ రెడ్డి దిశా నిర్దేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ నీటి వాటాలకు సంబంధించి అసెంబ్లీలో వాడివేడి చర్చ జరిగే అవకాశమున్నందున ఆయా నదీ పరివాహక ప్రాంతాల్లోని అధికార పార్టీ ఎమ్మెల్యేలంతా ఈ అంశాలపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. తద్వారా ప్రధాన ప్రతిపక్షంపై యుద్ధానికి సిద్ధమై రావాలని ఆయన దిశా నిర్దేశం చేశారు. సోమవారం అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో మంత్రులు, ప్రభుత్వ విప్‌లతో సీఎం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...తెలంగాణ నీటి వాటాలపై నిగ్గు తేల్చాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. అందువల్ల అందరూ సరిగ్గా ప్రిపేరై రావాలని, పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తటం ద్వారా ప్రధాన ప్రతిపక్షాన్ని ఇరుకున పెట్టాలని సూచించారు. ఈ మేరకు అధికార పార్టీ ఎమ్మెల్యేలందరూ సభకు హాజరయ్యేలా చూడాలంటూ మంత్రులు, ప్రభుత్వ విప్‌లను ఆదేశించారు. జనవరి ఒకటిన బేగంపేట ప్రజాభవన్‌లో ఏర్పాటు చేయబోయే పవర్ పాయింట్ ప్రజంటేషన్‌కు ఏ ఒక్కరికీ మినహాయింపు లేదని స్పష్టం చేశారు. నూతన సంవత్సర వేడుకల పేరు చెప్పి, ఎవరు డుమ్మా కొట్టినా ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు. దాదాపు 35 నిమిషాలపాటు సాగిన ఈ భేటీలో సీఎం ప్రధానంగా నీటి వాటాల గురించే మాట్లాడినట్టు సమాచారం. కాగా అసెంబ్లీ లాబీల్లో తనకు ఎదురైన పాత్రికేయులతో ముచ్చటించిన సిఎం... బిఆర్ఎస్‌పైన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఆ పార్టీ తన ఉనికిని కాపాడుకునే పనిలో ఉందని ఎద్దేవా చేశారు. సభలో కెసిఆర్‌తో ఏం మాట్లాడారంటూ అడగ్గా...'అది మీకెలా చెబుతాం...' అంటూ చమత్కరించారు. ప్రతీ సభ్యుడిని గౌరవించినట్టుగానే కెసిఆర్‌ను గౌరవిస్తామన్నారు. కెసిఆర్ గతంలో అనారోగ్యం పాలైనప్పుడు కూడా తాను ఆస్పత్రికి వెళ్లి పరామర్శించానంటూ సిఎం గుర్తు చేశారు. అసెంబ్లీ నుంచి తొందరగా కేసీఆర్ వెళ్లిపోవటాన్ని ప్రస్తావించగా...'ఆ విషయంపై ఆయన్నే అడిగితే బాగుంటుంది...' అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

పుస్తకావిష్కరిస్తున్న నాగేశ్వర్, రాఘవేంద్రన్ తదితరులు

పెన్షనర్ల హక్కులపై రాజీ పడేది లేదు

- మాజీ ఎమ్మెల్సీ కె నాగేశ్వర్
- తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెన్షనర్ల హక్కుల విషయంలో రాజీ పడేది లేదని, అవసరమైతే పోరాటానికి సిద్ధంగా ఉండాలని మాజీ ఎమ్మెల్సీ కె.నాగేశ్వర్, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ జనరల్ సెక్రెటరీ కె.రాఘవేంద్రన్ అన్నారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర మహాసభ సోమవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అసోసియేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ ఎంఎన్ రెడ్డి స్వాగత ఉపన్యాసంతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా నాగేశ్వర్ మాట్లాడుతూ.. ఉద్యోగులుగా ఉన్న సమయంలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, డైలీవేజ్ విధానాల ద్వారా విభజించిన ప్రభుత్వాలు, ఉద్యోగ విరమణ అనంతరం కూడా పెన్షనర్లను ఈపీఎఫ్, స్టేట్, సెంట్రల్ వంటి విభాగాలుగా చీల్చుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షనర్ల సమస్యలతోపాటు సీనియర్ సిటిజన్ల సమస్యలను కూడా కలుపుకొని పోరాటం చేస్తేనే ప్రభుత్వాలు స్పందిస్తాయన్నారు. జనరల్ సెక్రటరీ కె.రాఘవేంద్రన్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. పెన్షనర్లను వివిధ విభాగాలుగా విభజిస్తూ చట్టాలు తీసుకురావడం అన్యాయమని, పెన్షన్ కమ్యూటేషన్‌పై అధిక వడ్డీ వసూలు చేయడం ద్వారా వారిని ఆర్థికంగా ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులు మారకపోతే ఉద్యమానికి సిద్ధం కావాల్సిందేనని పిలుపునిచ్చారు. అలాగే, తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జెఎసి చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు ఈ సభకు హాజరై మహాసభ విజయవంతం అవ్వాలని ఆకాంక్షించారు. స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయిన అనంతరం పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఉద్యమం ఉధృతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు పి.నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తులు

- వాటి పరిరక్షణకు పకడ్బందీ చర్యలు మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తులని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు. అందుకోసం పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి అజహరుద్దీన్, జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, స్మశాన వాటికలు తదితర అంశాలపై మంత్రి పొంగులేటి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోరబండ, ఎర్రగడ్డ, షేక్‌పేట్ ప్రాంతాల్లో దశాబ్దాలుగా మైనార్టీలు స్మశాన వాటిల్లేక ఇబ్బంది పడుతున్నారని వివరించారు. ఈ సమస్యను వీలైనంత త్వరగా రక్షణ శా, రెవెన్యూ, వక్ఫ్ బోర్డు సమన్వయంతో అధిగమించాలని కోరారు. అవసరమైన చోట రెవెన్యూ భూమిని రక్షణశాఖకు బదలాయించి వారి నుంచి ప్రత్యామ్నాయంగా భూమిని తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ భూమిని వక్ఫ్ బోర్డుకు అప్పగించాలని అన్నారు. పేదల సంక్షేమం, ప్రజా అవసరాలు, అభివృద్ధి కార్యక్రమాల కోసం వినియోగించాల్సిన ప్రభుత్వ భూములను కొద్దిమంది స్వార్థప్రయోజనాల కోసం కబ్జా పెట్టే ప్రయత్నాలు చేస్తుంటారని చెప్పారు. వాటిని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ఆక్రమణలను గుర్తించిన వెంటనే నోటీసులను జారీ చేసి అవసరమైతే ఖాళీ చేయించి ప్రభుత్వ ఆధీనంలోకి తేవాలని, వివాదాల్లో ఉన్న భూముల పరిరక్షణకు న్యాయపరంగా గట్టిగా వ్యవహరించాలని కలెక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో టిఎంఆర్ఇఐఎస్ వైస్ చైర్మన్ ఫహీం ఖురేషి, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి బి షఫీఉల్లా, హైదరాబాద్, మేడ్చల్ జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

బిఆర్ఎస్‌ది తప్పుడు ప్రచారం

- పాలమూరు-రంగారెడ్డిలో 49 టిఎంసిలకు అంగీకరించామనేది పచ్చిఅబద్ధం
- బిఆర్ఎస్ వల్లే కృష్ణా జలాల్లో హక్కులు కోల్పోయాం
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కృష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యూనల్-2 (కెడబ్ల్యుడిటి) తుది తీర్పు వచ్చే వరకు 299 టిఎంసిలకు కట్టుబడి ఉంటామని ఆపెక్స్ కౌన్సిల్‌లో బిఆర్ఎస్ ఒప్పుకుందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం అసెంబ్లీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. అపెక్స్ కౌన్సిల్, కేఆర్ఎంబీ బోర్డు మీటింగుల్లో చేసిన సంతకాల మినిట్స్‌ను సభకు సమర్పిస్తామని ఉత్తమ్ తెలిపారు. బిఆర్ఎస్ చేసిన తప్పిదాలకు తెలంగాణ నీటి హక్కులను కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. చేసిందంతా చేసి... ఉమ్మడి పాలమూరు, నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు కాంగ్రెస్ అన్యాయం చేసిందంటూ గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. "పాలమూరు-రంగారెడ్డిలో 90 టిఎంసి లకు బిఆర్ఎస్ ప్రతిపాదించింది. దాన్ని మేము ముందుకు తీసుకువెళున్నాం. 45 టీఎంసీలు మైనర్ ఇరిగేషన్‌కు, 45 టిఎంసిలు గోదావరి డైవర్షన్ వారిచ్చిన జీవోలో వాడారు. దాన్ని ప్రస్తావిస్తూ మేం లేఖ రాశాం. మొదటగా 45 టిఎంసిలను మైనర్ ఇరిగేషన్‌కు క్లియర్ చేయమని అడిగాం. పేజ్-1లో ఇనిషియల్‌గా చేయమని అడిగాం. ఇందులో తెలంగాణ ప్రయోజనాలను ఎక్కడా విస్మరించలేదు. వాస్తవం ఇలా ఉంటే బీఆర్ఎస్ దాన్ని తప్పుగా ప్రచారం చేస్తున్నది" అని మంత్రి విమర్శించారు. పదేండ్లలో నీటి పారుదల శాఖకు రూ.1.83 లక్షల కోట్లు ఖర్చు చేశారని అన్నారు. కేవలం కాళేశ్వరం కోసమే పాలమూరు-రంగారెడ్డి, కోయిల సాగర్, నెట్టెంపాడు, భీమా డిండీ, ఎస్ఎల్‌బీసీ మొదలగు ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లా ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. హరీశ్ చెబుతున్నట్టు పాలమూరు-రంగారెడ్డికి సంబంధించి 90 శాతం పనులు కాలేదనీ, రూ. 27 వేల కోట్లు ఖర్చు పెట్టి, 36 శాతం పనులు మాత్రమే చేశారని గుర్తు చేశారు. తాము అధికారం చేపట్టిన రెండేండ్లలో దాదాపు రూ.7వేల కోటు చేశామని చెప్పారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి

- అసెంబ్లీ వద్ద మాజీ సర్పంచ్‌ల నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెండింగ్ బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచ్‌లు సోమవారం అసెంబ్లీ వద్ద నిరసన తెలిపారు. పెండింగ్ బిల్లులతో పాటు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాలకు న్యాయం చేయాలని జెండాలు, ప్ల కార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోలీసులకు మాజీ సర్పంచ్‌లకు మధ్య కొద్ది సేపు వాగ్వాదం జరిగింది. అనంతరం ఆందోళన చేస్తున్న వారిని అరెస్ట్ చేసి అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా తెలంగాణ మాజీ సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు సుర్వి యాదయ్యగౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేండ్లవుతున్నా పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో తమ సమస్యను పరిష్కరిస్తామని ప్రకటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి ప్రధాన కార్యదర్శులు మోడెం విద్యాసాగర్, రాంపాక నాగయ్య కేశ బోయిన మల్లయ్య తదితరులు పాల్గొన్నారు

'పాలమూరు-రంగారెడ్డి' రైతులకు అన్యాయం

- బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం అఖిలపక్ష పోరాటం అవసరం
- యూరియా యాప్‌పై ప్రభుత్వం పునరాలోచన చేయాలి
- జర్నలిస్టుల్లో విభజన సరికాదు.. అందరికీ అక్రిడిటేషన్లు ఇవ్వాలి : జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వంలోనూ రైతులకు అన్యాయం జరుగుతూనే ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రం జీవీవీ గార్డెన్‌లో నిర్వహించిన సిపిఎం జిల్లా స్థాయి విస్తృత స్థాయి సమావేశానికి సోమవారం ఆయన హాజరయ్యారు. అనంతరం మీడియా సమావేశంలో జాన్‌వెస్లీ మాట్లాడారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి 90శాతం పనులు పూర్తయ్యాయని మాజీ సీఎం కేసీఆర్, అసలు పనులే చేయలేదని సిఎం రేవంత్‌రెడ్డి అంటున్నారన్నారు. అయితే, గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు నిధుల కేటాయింపుల్లో నిర్లక్ష్యం చేయడం వల్లే ప్రాజెక్టు పనులు మందగించాయని తెలిపారు. భూ సేకరణ, కాల్వల నిర్మాణం సక్రమంగా జరగకపోవడంతో సాగునీరందక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. భూములు కోల్పోయిన రైతులకు ఇప్పటికీ తగిన నష్టపరిహారం అందలేదన్నారు. ఇది రైతుల పట్ల ప్రభుత్వాల వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఈ రెండు ప్రభుత్వాలు కూడా ప్రాజెక్టు కోసం రూ.32వేల కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకున్నాయని విమర్శించారు. ఇంకా రూ.42 వేల కోట్ల నిధులు కేటాయించాల్సి ఉందన్నారు. 4వేల ఎకరాలు భూ సేకరణ, కాలువల నిర్మాణం, భూములు కోల్పోతున్న నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ సాధన అంశంపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటోందని స్పష్టమవుతోందని, ఈ అంశాన్ని రాజకీయ లాభనష్టాలకు పరిమితం చేయకుండా అఖిలపక్షం ఆధ్వర్యంలో ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరముందని జాన్‌వెస్లీ అన్నారు. బీసీలకు న్యాయం జరిగే వరకు సిపిఎం తన పోరాటాన్ని కొనసాగిస్తోందని స్పష్టం చేశారు.

ఎన్నో హామీలిచ్చి అధికారంలోకొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండు ఏండ్ల పరిపాలనలో అన్ని రంగాల్లోనూ వైఫల్యం చెందిందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై అసెంబ్లీలో స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అసెంబ్లీ ప్రజల గొంతుకగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు ప్రకటించకుండా నిరుద్యోగులను మోసగిస్తోందని విమర్శించారు. అదేవిధంగా మహిళలకు రూ.2500 ఇంతవరకు ఇవ్వలేదని, ఇందిరమ్మ ఇండ్ల విషయంలో పూర్తి స్థాయిలో పేద ప్రజలకు న్యాయం జరగడం లేదని అన్నారు. ముఖ్యంగా పాత ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని, కొత్త చట్టం పేరుతో ఉపాధి పనిదినాలను కుదించే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇది గ్రామీణ పేదల జీవనంపై దాడి వంటిదన్నారు. యూరియా పంపిణీలో తీసుకొచ్చిన యాప్‌పై ప్రభుత్వం పునరాలోచన చేయాలని సూచించారు. సరిపడా యూరియా అందుబాటులో ఉంచి, ఎక్కడా కొరత తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. యూరియా కొరత కొనసాగితే రైతులతో కలిసి సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ల జారీ విషయంలో వివక్ష చూపడం తగదన్నారు. డెస్క్ జర్నలిస్టులను వేరు చేయొద్దని, గతంలో ఇచ్చినట్టుగా 23వేల మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులివ్వాలన్నారు. స్వేచ్ఛాయుత మీడియా లేకుండా ప్రజాస్వామ్యం బలపడదని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు కొలిశెట్టి యాదగిరి రావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు, కోట గోపి, అవాజ్ జిల్లా కార్యదర్శి జహంగీర్ ఉన్నారు.

హత్య కేసులో 14 ఏళ్ల తర్వాత తీర్పు

- హంతకుడికి మరణశిక్ష విధించిన న్యాయస్థానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ హద్దుల్లో 2011లో సంచలనం సృష్టించిన భరత్‌నగర్ హత్య కేసులో కూకట్‌పల్లి న్యాయస్థానం సోమవారంకీలక తీర్పును వెలువరించింది. మహిళను అత్యంత కిరాతకంగా హత్య చేసిన నిందితుడికి మరణశిక్ష విధిస్తూ కోర్టు చారిత్రాత్మక తీర్పు ప్రకటించింది. దాదాపు 14 ఏళ్ల సుదీర్ఘ న్యాయపోరాటం అనంతరం, ఈ కేసులో దోషి అయిన కరణ్ సింగ్ అలియాస్ కమ్మ సింగ్‌ను దోషిగా నిర్ధారించిన 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి వెంకటేశ్వరరావు సోమవారం తుది తీర్పు వెల్లడించారు. కేసు విచారణలో వెలుగులోకి వచ్చిన అంశాలు మనసును కలచివేసే విధంగా ఉన్నాయి. కరణ్ సింగ్‌కు అతని సవతి తల్లి కుమార్తె మాయ కౌర్‌తో వివాహేతర సంబంధం ఉన్నట్టు దర్యాప్తులో తేలింది. ఇదే చివరకు హత్యకు దారితీసినట్టు పోలీసులు నిర్ధారించారు. సనత్‌నగర్‌కు చెందిన అప్పటి పిసి కప్పరి రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఇన్‌స్పెక్టర్ జి బస్వా రెడ్డి కేసు నమోదు చేశారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ సాయి శ్రీనివాస్‌రావు సమగ్రంగా దర్యాప్తు చేసి, పక్కా ఆధారాలతో నిందితుడిపై ఛార్జిషీట్ దాఖలు చేయడంతో కేసు కోర్టులో నిలబడింది. ఈ తీర్పుపై సైబరాబాద్ సిపి అవినాష్ మొహంతి స్పందిస్తూ.. కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అహర్నిశలూ శ్రమించిన పోలీసు అధికారులను అభినందించారు. ఆలస్యంగానైనా తప్పకుండా నేరస్థులకు శిక్ష పడుతుందనే విషయాన్ని ఈ తీర్పు మరోసారి రుజువు చేసిందని అన్నారు.

అసమానతలు పెంచడమే ఆర్ఎస్ఎస్, బిజెపి విధానం

- రాజ్యాంగ రక్షణ కోసం ఉద్యమించాలి
- కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మనుషుల మధ్య అసమానతలను స్థిరపర్చడమే ఆర్ఎస్ఎస్, బిజెపి విధానమని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు అన్నారు. మనుస్మృతి, మనువాదానికి వ్యతిరేకంగా.. రాజ్యాంగ రక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. జయశంకర్-భూపాలపల్లి జిల్లా కేంద్రం కారల్ మర్క్స్ నగర్‌లోని శ్రామిక భవన్‌లో సోమవారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో "అంబేద్కర్ ఆశయాలు.. నేటి తరం కర్తవ్యాలు" అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ.. మనుస్మృతి భావజాలాన్ని మట్టుపెట్టకపోతే మరో వెయ్యి ఏళ్లయినా దేశ ప్రజల మధ్య ఐక్యత అసాధ్యమని చెప్పారు. తల్లి గర్భం నుంచి మనుషులు జన్మిస్తారని, కానీ మనుస్మృతి దానిని అంగీకరించదని చెప్పారు. అసమానతలను స్థిరపరచడానికి చాతుర్వర్ణ వ్యవస్థను సమాజంపై రుద్దిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచంలో ఎక్కడా లేని కుల వ్యవస్థను దోపిడీ సాధనంగా పేదల ఐక్యతకు ఆటంకంగా కొనసాగిస్తుందని అన్నారు. దేశంలో సామాజిక అసమానతలు, వివక్షకు కారణం మనుధర్మ శాస్త్రమని తెలిపారు. కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మంద సంపత్ మాట్లాడుతూ.. రాజీవ్ యువశక్తి పేరిట దరఖాస్తులు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులందరికీ తక్షణమే రుణాలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఇసునం మహేందర్, గుర్రం దేవేందర్, జిల్లా ఉపాధ్యక్షులు అత్కూరి శ్రీధర్, నాయకులు పొట్టయ్య, చందు, సంతోష్ కుమార్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

వరంగల్‌లో గుడిసెవాసుల భారీ ధర్నా

- ఇళ్ల పట్టాలు ఇవ్వకుంటే ఎన్నికల్లో బుద్ధి చెప్తాం : ఎస్ వీరయ్య
- పట్టాలిస్తామని గత ప్రభుత్వం మోసగించింది : జి నాగయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరంగల్ నగరంలో గుడిసెలు వేసుకున్న పేదలు ఆందోళన బాటపట్టారు. వేసుకున్న గుడిసెలకు పట్టాలివ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. సోమవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు భారీ స్థాయిలో పేదలు హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదకు వినతిపత్రం అందించారు. ధర్నానుద్దేశించి సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య మాట్లాడుతూ.. గుడిసెలేసుకున్న వారికి ఇండ్ల పట్టాలు ఇవ్వకపోతే రానున్న ఎన్నికల్లో ప్రభుత్వాలకు బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ప్రభుత్వం, దేవాదాయ భూముల్లో 25 ఏళ్ల కిందట పేద ప్రజలు సిపిఎం ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకున్నారని తెలిపారు. వేలాది కుటుంబాలు గుడిసెలేసుకొని జీవిస్తున్నాయన్నారు. ఐదు సార్లు తెలంగాణ ముఖ్యమంత్రిని కలిసి ఇళ్లు లేని వారి కష్టాలను వివరిస్తే, ఇంతవరకు గుడిసెవాసులకు పట్టాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోటీశ్వరులు, బడా వ్యాపారులు శిఖం భూముల్లో బహుళ అంతస్తులు కట్టుకుంటే ప్రభుత్వానికి కనబడటం లేదా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ భూమి ప్రజల కోసం కాకుండా కబ్జాదారులు, బడా రాజకీయ నాయకులకు కట్టబెట్టడానికా? అని ప్రశ్నించారు. 2022 డిసెంబర్ వరకు సొంత ఇల్లు లేని వారికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్లు కట్టిస్తామని ప్రధానమంత్రి ఇచ్చిన మాట తప్పారని విమర్శించారు. పేదలకు ఇల్లు, స్థలాలు ఇవ్వని ప్రధానమంత్రి రూ.465 కోట్లతో ఇల్లు కట్టించుకున్నారని అన్నారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.నాగయ్య మాట్లాడుతూ.. 20ఏండ్లుగా గుడిసెలేసుకొని నివాసం ఉంటున్న పేదలకు గత ప్రభుత్వంలో అధికారులు నోటీసులు ఇచ్చారని అన్నారు. గత ప్రభుత్వం ఇండ్ల పట్టాలు ఇస్తామని మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా గుడిసెవాసులకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ భూములను వెలికి తీసి పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. 25 ఏళ్లుగా వరంగల్ నగరంలో గుడిసెలు వేసుకుని ఉంటున్న వారికి పట్టాలు ఇవ్వకపోతే రానున్న ఎన్నికల్లో ప్రభుత్వానికి గట్టి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బాబు, నలిగంటి రత్నమాల, ఆరూరి కుమార్, ఎండి బషీర్, వలదాసు దుర్గయ్య, యారా ప్రశాంత్ జక్కలుద్ది నాయకులు రామా సందీప్, లక్ష్మీపురం నాయకులు ధర్మారపు సాంబమూర్తి, మల్లు స్వరాజ్యం నాయకులు గున్నాల ప్రభాకర్, గాల య్య, జానీ, అప్పాజీ వాణి, రాజు, భవాని, రాజేష్, కవిత, దివ్య, విజయ, వేలాదిమంది గుడిసెవాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రాధాన్యలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- వెన్యూ ఉద్యోగులకు మంత్రి పొంగులేటి ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలు, ప్రాధాన్యతలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని రెవెన్యూ ఉద్యోగులను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. గతేడాది ఏ విధంగా ప్రభుత్వ ప్రాధమ్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లారో అదే విధంగా వచ్చే ఏడాదిలోనూ పనిచేయాలని సూచించారు. తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల జెఎసి చైర్మన్ వి లచ్చిరెడ్డి నేతృత్వంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం, తెలంగాణ తహశీల్దార్ల సంఘం, తెలంగాణ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ (టిజీఆర్ఎస్ఎ) నేతలు మంత్రి పొంగులేటిని సోమవారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా టిజీఆర్ఎస్ఎ నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతేడాదిలో రైతులకు భూసమస్యల పరిష్కారం కోసం భూభారతి చట్టాన్ని తెచ్చామని అన్నారు. ఈ చట్టం రాకతో రెవెన్యూ సేవలు క్షేత్రస్థాయిలోనూ అందుబాటులోకి వచ్చాయన్నారు. కేంద్రీకృతమై ఉన్న రెవెన్యూ సేవలను వికేంద్రీకరణ చేశామని వివరించారు. గ్రామాల్లోనే రైతులకు రెవెన్యూ సేవలను అందించేందుకు గ్రామ పాలనా అధికారులు (జిపిఒ)ను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఏ విధమైన భూసమస్య ఉన్నా జిల్లా స్థాయిలోనే పరిష్కారం చేసేలా చేశామని చెప్పారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి : లచ్చిరెడ్డి

రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ ఉద్యోగుల జెఎసి చైర్మెన్ వి లచ్చిరెడ్డి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. అన్ని స్థాయిలోని ఉద్యోగుల పదోన్నతులు, తహశీల్దార్ల అద్దె భవనాల పెండింగ్ బిల్లులు తదితర అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశాలపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో టిజీఆర్ఎస్ఎ అధ్యక్ష, కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి భిక్షం, మహిళా విభాగం అధ్యక్షురాలు సుజాత చౌహాన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణ, తెలంగాణ తహశీల్దార్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ రాములు, రమేష్ పాక, మహిళా విభాగం అధ్యక్షులు ఎం రాధ, సెక్రెటరీ జనరల్ పూల్‌సింగ్ చౌహాన్, టిజిటిఎ, టిజీఆర్ఎస్ఎ రాష్ట్ర నాయకులు జయశ్రీ, రాంబాబు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలే.. సమస్యలు..

- అసెంబ్లీ తొలిరోజే ఏకరువు...

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మిగతా రోజులన్నింటిలోనూ సభ ఇలాగే హుందాతనంగా, సజావుగా సాగుతుందో లేదో తెలియదుగానీ, తొలి రోజు మాత్రం అసెంబ్లీ ఎంతో ప్రశాంతంగా సాగిపోయింది. అయితే ఆ ప్రభుత్వం, ఈ ప్రభుత్వమనే తేడా లేకుండా ప్రతీసారి సభ్యులు తమ తమ నియోజకవర్గాల్లోని సమస్యలను ఏకరువు పెడుతూ వస్తున్నారు. శాసనసభ శీతాకాల సమావేశాల తొలిరోజైన సోమవారమే మొత్తం 39 మంది సభ్యులు జీరో అవర్‌లో విద్య, వైద్యం, రహదారులు, మంచినీరు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను సర్కారు దృష్టికి తేవడం గమనార్హం. దీన్నిబట్టే రాష్ట్రంలోని పరిస్థితి ఏ విధంగా ఉందో విదితమవుతున్నది. అసెంబ్లీ బయట వాగ్బాణాలు సంధించుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్, సభ లోపల మాత్రం ఆప్యాయంగా పలకరించుకోవటం మొత్తానికే హైలెట్‌గా నిలిచింది. పలు ఆర్డినెన్సుల ప్రతిపాదన, మాజీ ఎమ్మెల్యేలు దామోదరరెడ్డి, కొండా లక్ష్మారెడ్డి మరణం పట్ల సభ సంతాపం తెలిపింది. అనంతరం అసెంబ్లీని జనవరి రెండుకు వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు.

సింగరేణిని ప్రయివేటీకరించే కుట్రకు బిఆర్ఎస్ మద్దతు

- బి జనక్ ప్రసాద్ విమర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగరేణిని ప్రయివేటీకరించే కుట్రకు మద్ధతుగా వచ్చిన బిల్లుకు పార్లమెంటులో నాడు బీఆర్ఎస్ మద్ధతునిచ్చిందని ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ బి.జనక్ ప్రసాద్ విమర్శించారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆ పార్టీకి చెందిన మాజీ మంత్రి హరీశ్ రావుకు సింగరేణిపై మాట్లాడే నైతిక అర్హత లేదని విమర్శించారు. నాడు ఆర్థిక మంత్రిగా హరీశ్ రావు సింగరేణి నిధులను ఇష్టారాజ్యంగా వినియోగించి రూ.30 వేల కోట్ల బకాయిలను మోపారని గుర్తుచేశారు. సింగరేణి సొమ్ముతో సిద్ధిపేటలో స్టేడియం నిర్మించారని తెలిపారు. మెడికల్ కాలేజీకి రూ.500 కోట్లు కేటాయించి కార్మికుల పిల్లలకు కనీస స్థాయిలో మెడికల్ సీట్లు సమక్రంగా కేటాయించలేదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు రూ.ఒక కోటి ప్రమాద బీమా కల్పించిందనీ, కాంట్రాక్ట్ కార్మికుల బోనస్‌ను రూ.5 వేల నుంచి రూ.5,500 పెంచిందనీ, నియామకాలకు వయో పరిమితిని 35 ఏండ్ల నుంచి 40 ఏండ్లకు పెంచిందనీ, కాంట్రాక్ట్ కార్మికులకు ప్రత్యేక బోనస్, బీసీ లైజనింగ్ అధికారిని నియమించిందని తెలిపారు.

ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్‌గా ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిపిసిసి అనుబంధ విభాగం ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్‌గా ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. వైస్ చైర్మన్లుగా పునెం చంద్రకళ, విస్లావత్ లింగం నాయక్, సెడ్మకి ఆనందరావు, కురుకుల మల్లికార్జున్ నియమితులయ్యారు.

ఇన్‌సర్వీస్ టీచర్లకు ఓడి కల్పించాలి

- పిఆర్‌టియు తెలంగాణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జనవరిలో జరిగే టెట్ పరీక్ష రాసే ఇన్‌సర్వీస్ టీచర్లకు ఓడీ కల్పించాలని పిఆర్‌టియు తెలంగాణ కోరింది. ఈ మేరకు సోమవారం పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎం.చెన్నయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.రత్నాకర్ రావు, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఎన్.చంద్రశేఖర్ రావు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్సీఈఆర్టీ, సుప్రీంకోర్టు టెట్ పరీక్ష రాయడం అనివార్యమని చెప్పిన నేపథ్యంలో ఆన్ డ్యూటీ సౌకర్యం కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.

'పిఆర్‌సి' జాప్యం చేస్తే ఉద్యమ కార్యాచరణ

- అన్ని పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి
- టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చావ రవి, ఎ వెంకట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పిఆర్‌సి వెంటనే అమలు చేయాలని, జాప్యం జరిగితే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యుటిఎఫ్) రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చావ రవి, ఎ.వెంకట్ అన్నారు. జనగామ జిల్లాలో నిర్వహించిన యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ విస్తృత సమావేశాల్లో భాగంగా రెండో రోజు సోమవారం ప్రతినిధుల సభలో చావ రవి మాట్లాడారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయ ఉద్యోగులకు పీఆర్సీని జులై 1, 2023 నుంచి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగా ఉద్యోగుల అన్ని రకాల పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని, పెండింగ్ డీఏ ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ ఉపాధ్యాయులను ఆందోళనకు గురిచేస్తున్న టెట్ సమస్యపై కేంద్రం ఉదాసీనత సరికాదన్నారు. రాష్ట్రంలో 45 వేల మంది, దేశవ్యాప్తంగా 25 లక్షల మందిపై ప్రత్యక్షంగా ప్రభావం చూపుతున్న టెట్‌పై సుప్రీంకోర్టు తీర్పు వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధ్యాయుల ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి, తరగతికొక ఉపాధ్యాయుడిని నియమించి నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలని అన్నారు. కానీ, అందుకు బదులుగా ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ వంటి సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని ఏర్పాటు చేస్తున్న క్లాసులు నిరుపయోగంగా ఉన్నాయని అన్నారు. ఉపాధ్యాయులను స్వేచ్ఛగా పాఠాలు చెప్పనివ్వండని, బోధనేతర పనుల భారం నుంచి విముక్తులను చేసి ఆన్‌లైన్ నివేదికలు పంపడానికి బోధనేతర సిబ్బందిని కేటాయించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్ మాట్లాడుతూ.. పాఠశాల విద్యాశాఖలో కొనసాగుతున్న ట్రైనింగ్‌లు(ఉన్నతి, ఎఫ్ఎల్ఎన్, లక్ష్య, ఎఫ్ఆర్ఎస్) ఇతర కార్యక్రమాల పేరుతో విద్యాబోధనలకు ఆటంకంగా ఉన్న విధానాలపై సమీక్షించాలని అన్నారు. ఉపాధ్యాయులకు శిక్షణల పేరిట పాఠశాలలో ఎన్జీవోల జోక్యం సరైంది కాదన్నారు. కేజీబీవీ, మోడల్ స్కూల్, గురుకులాల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె జంగయ్య, చావ దుర్గా భవాని, కోశాధికారి టి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు కె సోమశేఖర్, ఎం రాజశేఖర్ రెడ్డి, డి సత్యానంద్, జి నాగమణి, కె రంజిత్ కుమార్, ఎస్ మల్లారెడ్డి, జి శ్రీధర్, ఆడిట్ కమిటీ కన్వీనర్ జె యాకయ్య, జనగామ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి చంద్రశేఖర్‌రావు, మడూరు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చలిలోనూ బీడీ కంపెనీ ఎదుట కార్మికుల ధర్నా

- కార్మికుల శ్రమను దోచుకుంటున్న తాజ్ యాజమాన్యం
- చర్చలు జరిపినా పట్టించుకోని వైనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తాజ్ యాజమాన్యం.. మూడేండ్లుగా బీడీ కార్మికులతో పనులు చేయించుకుంటూ.. ఇప్పటివరకు వారి పిఎఫ్ ఖాతాల్లో డబ్బులు జమ చేయలేదని తెలంగాణ బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి నూర్జహాన్ తెలిపారు. బుధవారం నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండల కేంద్రంలోని తాజ్ బీడీ కంపెనీ ఎదుట యూనియన్ ఆధ్వర్యంలో బీడీ కార్మికులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మూడేండ్లుగా పీఎఫ్ డబ్బులు జమ చేయకపోవడంతోపాటు 14 క్వింటాళ్ల ఆకు, కార్మికులకు చెల్లించాల్సిన బట్వాడాను ఇవ్వలేదన్నారు. రెండేండ్లుగా ఆరోగ్యం సహకరించకపోవడంతో పలువురు రాజీనామా చేశారని, వారందరికీ ఇప్పటికీ సర్వీస్ డబ్బులు రాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఏడు నెలల కిందట ఢిల్లీలో సిఐటియు జాతీయ నాయకులతో జరిగిన చర్చల సందర్భంగా రెండు నెలల్లోనే కార్మికుల డబ్బులను అందజేస్తామని చెప్పారని, కానీ.. ఏడు నెలలు దాటినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అక్టోబర్ 9న తాజ్ బీడీ కంపెనీ వద్ద బీడీ కార్మికులతో పెద్దఎత్తున ఆందోళన చేసినప్పుడు కంపెనీ యాజమాన్యం.. మూడు నెలల గడువు కావాలని కోరిందని, అయినా హామీ నెరవేర్చలేదని అన్నారు. రాత్రి అయినా కార్మికులు అక్కడే చలి మంట వేసుకుని కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో బీడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు జి మోహన్, లలిత, లావణ్య, సునీత తదితరులు పాల్గొన్నారు.

మండలి 40 నిమిషాలే

స్పెషల్ మెన్షన్‌లో పలు సమస్యల ప్రస్తావన

- ఇద్దరు మాజీ సభ్యుల మృతికి సంతాపం
- 2026 జనవరి 2కు సభ వాయిదా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శాసనమండలి శీతాకాల సమావేశాల మొదటి రోజు సభ 40 నిమిషాలే నడిచింది. సోమవారం ఉదయం ప్రారంభం కాగానే ఇటీవల మరణించిన దివంగత సభ్యులు మాధవరం జగపతిరావు, అహ్మద్ పీర్ షబ్బీర్‌లకు నివాళులు అర్పించింది. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సంతాప తీర్మానం చదివి వినిపించారు. అనంతరం స్పెషల్ మెన్షన్‌లో సభ్యులు పలు అంశాలను ప్రస్తావించారు. వివిధ సమస్యలపై పిటిషన్లను సమర్పించారు ఒఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను ఫార్మా కంపెనీలకు అనుకూలంగా మార్చుతున్నారని, వెంటనే అలైన్ మెంట్ మార్పుపై ఖచ్చితమైన విధివిధానాలు ఉండాలని నెల్లికంటి సత్యం విజ్ఞప్తి చేశారు. కొత్త మండలాలను రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్సీ నవీన్ కుమార్ ప్రస్తావించారు. సిఎం ఇటీవల శంకుస్థాపన చేసిన ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులు పూర్తి చేసి వెంటనే ప్రారంభించాలని కోరారు. సభ్యులు మధుసూధనాచారి మాట్లాడుతూ ఓడేడు వరంగల్ బ్రిడ్జి పనులు 70 శాతం పూర్తయ్యాయని, వెంటనే మిగిలిన పనులు పూర్తి చేయాలన్నారు. క్రిప్టో కరెన్సీ మాయలో పడి కరీంనగర్ జిల్లాలో అనేక మంది రోడ్డున పడ్డారని ఎమ్మెల్సీ భానుప్రసాదరావు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సైబర్ నేరాల అదుపుకు కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న 1,120 అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేటెడ్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలనీ, గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి కేరళ తరహా పాలసీ తీసుకురావాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కోరారు. ఉద్యోగుల డిఎ, పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలని ఎమ్మెల్సీ మల్క కొమురయ్య విజ్ఞప్తి చేశారు. బిసి ఆత్మగౌరవ భవనాలకు నిధులు విడుదల చేసి వెంటనే పూర్తి చేయాలని సభ్యులు బసవరాజు సారయ్య, పటాన్‌చెరు నియోజకవర్గంలో ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని అంజిరెడ్డి కోరారు. సభ్యులు లేవనెత్తిన సమస్యలను నోట్ చేసుకున్న. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, కొండా సురేఖ, గడ్డం వివేక్‌లు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇటీవల మరణించిన రాష్ట్ర గీత రచయిత అందెశ్రీకి సభా పక్షాన సంతాపం తెలిపే అవకాశాన్ని పరిశీలించాలని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ కోరారు. సాధారణంగా సభలో సభ్యులైన వారికే సంతాపం తెలిపే సంప్రదాయం ఉంటుందనీ, కానీ అందెశ్రీ తన పాట ద్వారా తెలంగాణ ఉద్యమాన్ని ఎంతగానో ప్రభావితం చేశారన్నారు. ఆయన ఈ సభలో సభ్యులు కాకపోయినా విశేషమైన సందర్భంగా భావించి సభలో ఆయనకు సంతాపం తెలిపే అవకాశం పరిశీలించాలని సూచన చేశారు. ఇందుకు మండలి చైర్మన్ సానుకూలంగా స్పందించారు. అనంతరం సభను జనవరి 2కు వాయిదా వేశారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో ఉపాధ్యాయుడి ప్రతిభ

- లాంగ్ జంప్‌లో బ్రాంజ్ వంద మీటర్ల పరుగులో సిల్వర్ పతకం కైవసం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కరీంనగర్ జిల్లా మాస్టర్ అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీల్లో కరీంనగర్ డా బిఆర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన 12వ రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు ప్రతిభ కనబరిచారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం గౌరారం ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు తోలెం శ్రీనివాసరావు (ఎస్ఎ-జీవశాస్త్రం) ఈ పోటీలలో లాంగ్ జంప్ విభాగంలో బ్రాంజ్ పతకం, 100 మీటర్ల పరుగుపందెంలో సిల్వర్ పతకం సాధించారు. ఉపాధ్యాయుడిగా మాత్రమే కాకుండా క్రీడాకారుడిగా కూడా తన సామర్థ్యాన్ని చాటుతూ విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడకం మోతీరు మాట్లాడుతూ.. జీవశాస్త్రం అనేది పుస్తకాల్లో పరిమితమయ్యే విషయం కాదని, అది నిజజీవితంలో ఆరోగ్యం, శారీరక దృఢత్వం, జీవనశైలిని మార్చే శాస్త్రం అన్నారు. ఉపాధ్యాయులు బోధించే జ్ఞానాన్ని తమ జీవితంలో అమలు చేసి చూపినప్పుడే అది నిజమైన బోధన అవుతుందని కొనియాడారు. ఉపాధ్యాయుడే క్రీడల్లో ముందుండి విజయం సాధించడం విద్యార్థులకు గొప్ప స్ఫూర్తి అని తోటి ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

అప్పుల బాధలతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం అంజనాపురం గ్రామంలో అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్నారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ మేడా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాణావత్ వెంకటి (48) వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవారు. సాగు కోసం అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టాడు. పంట దిగుబడి సరిగా లేక అప్పులు చెల్లించలేకపోయారు. ఈ క్రమంలో కుటుంబ ఆర్థిక పరిస్థితి కుంటుపడింది. దాంతో మనస్తాపంతో వెంకటి ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. రైతుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి బావమరిది ధరావత్ వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ మేడా ప్రసాద్ తెలిపారు.